# ఆడజన్మ

వెంకటరత్నం అంటే శివకోవెల్లో పురాణం చెప్పుకునే వెంకమ్మగారు. మావూళ్ళో ఆవిడ పేరు తెలియని వాళ్ళు లేనేలేరు అంటే నమ్మండి. భర్త వున్నప్పటికీ లేడని భావించుకునే మహా పతివ్రత. కాషాయిగుడ్డలంటే ఆమెకు మహాప్రీతి. అందుచేత యెప్పుడూ కాషాయి బట్టలే కట్టుకునేది. కాషాయి బట్టకట్టుకొని, చేతిలో భాగవతం పట్టుకొని రోడ్డుమీద నడుస్తూంటే చూడ్డానికి ఎంతో ముచ్చటగా నుండేది. అయినా ముసలిదా, ముక్కుదా నలభై యోపడి. యవనపటుత్వానికి అందచందాలకి యేమీలోటులేదు. సన్యాసం అంటే పుచ్చుకుంది గాని మనిషిమాత్రం యేమీ చిక్కిపోలేదు. చూడ్డానికి మాత్రం బాగా బలసిన గాను గెద్దలాగ వుండేది. నలుగురమ్మలక్కలు అంటూవుండేవారు కూడా. అదేమిటమ్మా! మొగుడు వున్నదానివికదా చక్కగా రంగుబట్టలు కట్టుకోక కాషాయి గుడ్డలు కట్టుకుంటావేమిటని. కాని ఆవిడ మాత్రం పట్టించుకునేదికాదు. ఆ! మొగుడు మొద్దులూను. చిన్నప్పుడన్ని ఆముచ్చట్లు తీరిపోయినాయి. యింకా యిప్పుడు కూడా యేమిటి. యిప్పుడొచ్చాయి, ఈవాయిలు చీరెలు, బెనేరసు చీరెలు. సిల్కు గుడ్డలును. ఆకాలంలో త్రేతాయుగంలోను, ద్వాపర యుగంలోను వాళ్ళంతా యేరంగు చీరలు కట్టుకున్నారు. యింతకి నేను ముక్తికోసం పాటు పడుతూ వున్నదాన్ని; నాకెందుకవన్నీను అనేసి వూరుకునేది.

ఒకనాడు నేను నాసన్నిహిత మిత్రుడు ప్రకాశరావు కలిసి కోవిల్లోనికని వెళ్ళేము. మావాడికి ఆవిడని చూడగానే యేవో చిలిపిచేష్టలు చెయ్యాలని బుద్ధిపుట్టింది. అయితే యేం చేసినప్పటికి చెప్పుచ్చుకొని కొడుతుందని తెలుసు. అయినప్పటికి వుండబట్టక నాతోమాత్రం యిలా అన్నాడు. "ఓరే! రావు! చూచేవుట్రా యీ ఆడవాళ్ళ పొగరు. వీళ్ళంతా చదువులు చదివి వుద్యోగాలు చేస్తూ పూళ్ళమీద తిరుగుతూ వుండటం వల్ల మగవాళ్ళకి గిరాకీ తగ్గిపోతూంది. నాన్‌సెన్స్, ఆడవాళ్ళు వుద్యోగాలు చేయకూడదు" అన్నాడు. ఆమాటలకి ఆమెకు కోపం వచ్చిందికాబోలు చర్రునలేచి ఒక్కసారి కళ్ళద్దాలు పైకెత్తి చూస్తూ ఒరే ప్రకాశం నువ్వేనుట్రా అలాగ వాగుతున్నావు. ఆడదాని సంగతి యింకా నీకు తెలియదు. కుర్రకుంకవి. యిలా కూర్చో చెప్తాను. అని ఆమె వేదాంతం అంతా చెప్పడం మొదలు పెట్టింది.

"జగత్సర్వం స్త్రీమయం. స్త్రీలేనిదే యీప్రపంచమేలేదు. యీప్రపంచాన్ని అంతా సృష్టించిందే స్త్రీ. ఓంకార పరబ్రహ్మ శక్తి స్వరూపమే స్త్రీ. ప్రపంచమంతా స్త్రీని ఆరాధిస్తూవుంటే నువ్వామెను దూషిస్తున్నావా! యింతెందుకు ప్రకాశ్ ఒక్కవిషయం ఆలోచించుకో. నువ్వు యెందులోంచి పుట్టేవో తెలుసా? నిన్ను సృష్టించినవారెవరో తెలుసుకున్నావా? ఆడది నీప్రక్కన లేకపోతే నీమగజన్మ యెందుకు - కాల్చనా? నువ్వు ఉదయాన్నే బడిలోనికి వెళ్ళి ప్రార్థనలు చేస్తావు యెవరిగురించి? ఓభారతమాత అంటావు; ఆభారతమాత యెవరు? "సరస్వతీ నమస్తుభ్యం, వరదే కామరూపిణీ" అని పద్యం చదవందే పుస్తకం చేతబట్టవు కదా? ఆసరస్వతి యేశక్తిస్వరూపము? స్త్రీరూపము. ఈప్రపంచకము అంతా ఆశక్తిస్వరూపము మీదనే ఆధారపడివుంది. అందుకనే దసరాల్లో శక్తినిగురించి పూజలు చేస్తారు. అటువంటి శక్తిస్వరూపమయిన స్త్రీని గురించి పూర్తిగా తెలుసుకోకుండా విమర్శించటం, అవమానించటం యీమగపురుగులకో అలవాటయిపోయింది. యే పురాణాల్లో చూచినా, యే వేదాల్లో చూచినా, యే లోకంలో చూచినా ఆడదాందే అగ్రతాంబూలం అంటే నమ్ము. నేటి ప్రపంచములో కూడా రష్యా, అమెరికా, ఇంగ్లాండు దేశముల్లో చూస్తే ఆడదానికే యెక్కువ ప్రాముఖ్యత యిస్తున్నారు. యీనాడు మన దేశములో మగవాళ్ళు మదంబలసి మైమరచి, ఆడదాని ఔన్నత్యాన్ని చూచి సహించలేక, ఆడది వీధిగుమ్మం దాటితే అవమానకరమని మెడకి తాళిగట్టి యింట్లో కూర్చుండబెట్టేరు. యిటువంటి మగవారి చేష్టలు యికమీద సహించకూడదు. ఇంక యింటికిపో ప్రకాశ్,

చాలా పొద్దు పోయింది. ఇకనైన బుద్ధి తెచ్చుకొని ఆడజన్మ గురించి బాగా ఆలోచించుకో" అని ఆమె అంటూవుంటే ఇంత అల్లరి తుంటరకాయ అయిన ప్రకాశం చిక్కి అయిపోయి తుక్కు అయిపోయేడు. దేవుడికి దండం పెట్టుకొని యిద్దరం కలసి చల్లగా యింటికి జారేం.

అరాత్రి ప్రకాశం మాయింటికి వచ్చి, ఒరే రావు! చూచావురా! దీని పొగరు. దేవుడిమీద లేని భక్తి వుండ్రాళ్ళమీద అన్నట్టు, ప్రత్యక్ష దైవమైన భర్తమీదలేని ప్రేమ యీస్వాముల వార్లమీద, గుళ్ళో దేవుళ్ళ మీదనా. పాపం! ఆభర్త పెళ్ళాం చేతులో కీలుబొమ్మలాగ తిరుగుతున్నాడు. యింట్లో పక్కలు వెయ్యటం, పిల్లల బట్టలు వుతకడం అంతా అతనేకదా! ఆఖరికి విధిలేక రాత్రిళ్ళు పెళ్ళాం కాళ్ళుకూడా పిసుకుతున్నాడట. పాపం అమాయకపు బ్రాహ్మణుడు, యేం చేస్తాడు! కట్టుకున్న పెళ్ళాన్ని కాళ్ళ తన్నగలడా, కాదని మరొక చోటుకి పోగలడా. యిన్ని పనులు చేసినప్పటికి వేళకి సరిగా ముద్దలేక పోతూందాయె. 'చేసుకున్న మొగుడా అనుభవించురా' అని యిదంతా అతని కర్మ కాకపోతే యింకేమిటి. అతనికర్మకి యెవరు బాధ్యులు? బాధ్యతగల పెళ్ళామే దూరం చేస్తూంటే పైవాళ్ళకేం కావాలి. వుదయాన్నే లేచి వూరిమీదికి పోతేనేగాని యింట్లో జరగదాయె. ప్రొద్దున్నే ఆరు గంటలు కొట్టేసరికల్లా వూరుమీదికి వ్యాపకానికిపోయి మధ్యాహ్నం యేపన్నెండు గంటలకో యింటికి తిరిగి వచ్చే మగవాడిమీద విరుచుకు పడే ఆడదాన్ని చూచి యేమగవాడు సహించగలడు? నిత్యమూ యీబాధలు పడలేక ఒకనాడు అనేసేడటకూడా. ప్రాణం విసిగిందిమరి, యెంతకని సహించి వూరుకుంటాడు? మొగుడయి వున్నప్పుడు ఒకనాడైనా మొర మొరలాడ్డామరి. "ఒసే వెంకమ్మ ఇదిగో నువ్వు రోజూ కోవెల్లోకి వెళ్ళి వుదయం పన్నెండు గంటలకి, సాయంత్రం ఎనిమిదిగంటలకి యింటికి వస్తూవుంటే నాగతేంకాను. నేను ఆఫీసుకు వెళ్ళడం యెట్లా, నీకుతిండి బెట్టేవారెవరు? డబ్బు తెచ్చే వారెవరు? ఆస్వాములవార్లు యేమన్నా నిన్నుపోషిస్తున్నారా? యెందుకు నీకాస్వామీజీ మీద అంత భక్తి. ఆసన్యాసి ముండాకొడుకుల వెనక తిరిగితే నీకేమి వస్తుంది? యింటికొచ్చిన మొగుడికి వుడికిందో వుడకందో యింతముద్ద పడవేయకపోతే ఆముండాకొడుకు యెలా చస్తాడనుకున్నావు?" అని యేదో కొంచెం కోపంగా అనేసేటికల్లా ఆమహా యిల్లాలు తోకత్రొక్కిన పాములాగ చుర్రున లేచిపోయింది మొగుడిమీదికి. ఆ! యేమిటంటున్నారు, నన్ను యెన్ని మాటలేనా అనండి కాని, నాస్వామిజీని మాత్రం యేమనకండి. అతను మహాయోగి, గొప్ప త్యాగి. నిత్యము అతని పాదాలకి పూజచేస్తే మనం చేసిన పాపాలు పోతాయి. యింతకీ వయస్సులో వున్నప్పుడు మొగుడూ పెళ్ళాల వరసగాని, నలభైయ్యేభై యేళ్ళువచ్చిం తరువాత యింకా యేమిటి? యివ్వాళ దగ్గరనుంచి మీరు నావూసు యెత్తవద్దు. మీరెవరో నేనెవరో. యివ్వాళదగ్గరనుంచి మీరు నాజోలికి రావద్దు. జాగ్రత్త అని ఖచ్చితంగా చెప్పేసింది. ఆగయ్యాళి అలా మాట్లాడుతూవుంటే యింకేమి చేయగలడు, చేసుకున్న కర్మంరా శంభులింగం అనుకొని నోరుమూసుకొని వూరుకున్నాడు.

ఇలా మాప్రకాశం చెప్తూ వుంటే కోవెల్లో పురాణాలు చెప్పుకునే వెంకమ్మగారు యింత వేదాంతురాలా అనిపించింది. అయితే వాళ్ళయింటి భోగట్టాలన్నీ మావాడికి ఎలాగ తెలిసేయీ అని నేను అడక్కపోలేదు. మా మిత్రుడు కూడా వాళ్ళ యింట్లోనే బస చేస్తున్నాడుట. వాళ్ళయింట్లో యేగల్లంతు జరిగినా మావాడు పొంచుండి వింటూ వుంటాడు. అయితే నేను సన్నిహిత మిత్రుడిని అవటంవల్ల అవన్నీ నాకు మోసుకొనివచ్చి చెప్తూ వుంటాడు. ఇంతే జరిగిన విషయం.

ఎన్. కామేశ్వరరావు